
సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం ; 20 ; జూలై ; 2024



నారుమడుల్లో సస్యరక్షణ

భారీ వర్షాలకు సార్వా వరినాట్లు, నారుమడులు నీటమునుగుతున్నాయి. సరైన సస్యరక్షణ పద్ధతులు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. 8లో ▸



బోధనలో మేటి

ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ నూజివీడు ట్రిపుల్‌ఐటీ సొంతం. ఈనెల 22, 23 తేదీల్లో కౌన్సెలింగ్‌కు అధికారులు సిద్ధమవుతున్నారు. 8లో ▸



కుష్టు నివారణకు సమగ్ర సర్వే

జిల్లాలో కుష్టు నివారణ సమగ్ర సర్వే చురుగ్గా సాగుతోంది. పాలకొల్లు, నరసాపురం, పోడూరు, యలమంచిలి, ఆచంట మండలాల్లో కేసులు గుర్తించారు. 8లో ▸

● పూడికతీత లేక.. వర్షం నీరు పారక..

ముంపు ముప్పులో వరి

- ముంచెత్తుతున్న డ్రెయిన్లు
- గుర్రపుడెక్క, కిక్కిస తొలగింపులో జాప్యం
- నెల రోజుల ఆలస్యంగా పనులు
- జిల్లాలో 450 డ్రెయిన్ల పనులకు రూ.5.93 కోట్ల మంజూరు
- ఇప్పటివరకు 120 డ్రెయిన్లలో మాత్రమే తూడు తొలగింపు
- ముంపునీటి ప్రవాహానికి అవరోధంగా డ్రెయిన్లలో పూడిక
- ఆందోళనలో రైతులు

సాక్షి, భీమవరం: డ్రెయిన్లలోని తూడు తొలగింపు పనుల్లో జాప్యం పంట పొలాలను ముంపుబారిన పడేస్తోంది. సాగు ప్రారంభంలోనే అన్నదాతలకు కష్టాలను తెస్తోంది. జిల్లావ్యాప్తంగా రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వేల ఎకరాల్లోని తొలకరి పంట పొలాలు నీట మునుగుతున్నాయి.

నీటి ప్రవాహానికి ఆటంకం

జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, ఆకివీడు సబ్ డివిజన్ల పరిధిలో బొండాడ, గునుపూడి సౌత్, గొంతేరు, భగ్గేశ్వరం, మొగల్తూరు కాజా, రుద్రయ్యకోడు తదితర 294 కిలోమీటర్ల పొడవున 13 మేజర్, 330 కిలోమీటర్ల పొడవున 41 మీడియం, 956 కిలోమీటర్లు పొడవున 454 మైనర్ డ్రెయిన్లు ఉన్నాయి. ఎక్కడికక్కడ డ్రెయిన్లలో గుర్రపుడెక్క, తూడు పెరిగిపోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోంది. తుపాన్ల సమయంలో రోజుల తరబడి పంట పొలాలు నీట మునిగి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ముంపు నీటిని బయటకు పంపేందుకు రైతులు అగచాట్లు పడాల్సి వస్తోంది. నీటి ప్రవాహం సజావుగా సాగేందుకు వీలుగా ఏటా తొలకరి సాగు ప్రారంభానికి ముందే డ్రెయిన్‌లలో గుర్రపుడెక్క, కిక్కిస తొలగింపు పనులు చేస్తుంటారు. కాగా ఈ ఏడాది నెల రోజుల ఆలస్యంగా తూడు తొలగింపు పనులు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికలు రావడం పనుల జాప్యానికి కారణమని అధికారులు అంటున్నారు. జిల్లాలోని 450 డ్రెయిన్లలో గుర్రపుడెక్క, కిక్కిస తొలగింపు పనులకు రూ.5.93 కోట్లు మంజూరు కాగా పది రోజుల క్రితం డ్రెయినేజీ అధికారులు పనులు చేపట్టారు.

నత్తనడకగా పనులు

కాలువల్లోని కలుపు తొలగింపు పనులు నత్తనడకన సాగుతున్నాయి. కొన్నిచోట్ల కూలీల సాయంతో తూడు తొలగిస్తుండగా.. ఎక్కువ లోతు, మనుష్యులు దిగేందుకు వీలులేని చోట్ల డ్రోన్ల సాయంతో కెమికల్స్ స్ప్రేయింగ్ చేయిస్తున్నారు. స్ప్రేయింగ్ చేసిన వారం, పది రోజులలోపు అవి కుళ్లిపోతాయి. వాటిని తీసి గట్లుపై వేస్తుంటారు. ప్రస్తుతం ప్రతికూల వాతావరణ పరిస్థితులు నేపథ్యంలో ఈ పనులు ముందుకు సాగడం లేదు. ఇప్పటివరకు జిల్లాలో 120 డ్రెయిన్లలో మాత్రమే తూడు తొలగింపు పనులు పూర్తయ్యాయి. వాతావరణం అనుకూలిస్తే 20 రోజుల్లో పనులు పూర్తవుతాయని డ్రెయినేజీ శాఖ ఈఈ కిషోర్ తెలిపారు.


తణుకు మండలం తేతలిలో నీట మునిగిన పంట పొలాలు


పెనుమంట్రలో కిక్కిసతో నిండిన గోస్తనీ డ్రెయిన్


ఉండిలో ఉధృతంగా ప్రవహిస్తున్న బొండాడ డ్రెయిన్

12 వేల ఎకరాల్లో వరి నాట్లు మునక

బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలోని 2.3 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరుగనుండగా ఇప్పటివరకు 40 వేల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. వర్షం నీరు పారేందుకు డ్రెయిన్లలోని పూడిక అవరోధంగా మారడంతో పల్లపు ప్రాంతాలు, వేల ఎకరాల్లోని పంట పొలాలు నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. తాడేపల్లిగూడెం, ఆకివీడు, పెంటపాడు, తణుకు, గణపవరం తదితర మండలా ల్లోని 12 వేల ఎకరాల్లో నాట్లు వేసిన పొలాలు, ఆచంట, పోడూరు, పాలకొల్లు రూరల్, వీరవాసరం తదితర మండలాల్లోని 1,500 ఎకరాల్లోని నారుమడులు నీట మునిగాయి. రెండుమూడు రోజుల క్రితం నాట్లు వేసిన పొలాల్లో నారు పైకి తేలిపోతుందని, రోజుల తరబడి ముంపులో ఉంటే కుళ్లిపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. డ్రెయిన్లలో తూడు తొలగింపు పనులు త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వర్షాలను సమర్థంగా ఎదుర్కొంటాం

కలెక్టర్ నాగరాణి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో భారీ వర్షాల కారణంగా ఏర్పడిన పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు చేపట్టామని కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్యమంత్రికి వివరించారు. శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. ముందస్తు ప్రణాళికతో పనిచేయడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని ఆదేశించారు. చెరువు కట్టలు, వాగుల్లో ప్రవాహాలపై నిరంతర పర్య వేక్షణ ఉండాలని సూచించారు. ఫ్లడ్ మాన్యువల్ ద్వారా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికలు, పరిస్థితులను అంచనా వేసి అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. భీమవరం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో అధిక వర్షాల కారణంగా ఎదురయ్యే పరిస్థితులను ఎదుర్కోవడానికి అన్ని విధాల సిద్ధంగా ఉన్నామన్నారు. జిల్లాలో యనమదురు డ్రెయిన్ కారణంగా కొన్ని ప్రాంతాల్లో కొద్ది మొత్తంలో నీరు పంట పొలాల్లో చేరిందని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కర రావు, నీటిపారుదల శాఖ ఈఈ దక్షిణామూర్తి, భీమవరం ఆర్డీఓ బి.శ్రీనివాసులు రాజు తదితరులు పాల్గొన్నారు.

చినుకు.. వణుకు

- ఏకధాటిగా వర్షం.. స్తంభించిన జన జీవనం
- జిల్లాలో 174 సెం.మీ వర్షపాతం
- లోతట్టు ప్రాంతాలు జలమయం

సాక్షి, భీమవరం: బంగాళాఖాతంలో అల్పపీడనంతో రెండు రోజులుగా జిల్లాలో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. పల్లపు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వర్షం నీటితో పంట కాలువలు, డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. వేల ఎకరాల్లోని పంట పొలాలు నీటమునిగాయి. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు జిల్లావ్యాప్తంగా 174 సెంటీమీటర్ల వర్షం కురవగా సగటున 8.7 సెం.మీ వర్షపాతం నమోదైంది. తాడేపల్లిగూడెంలో అత్యధికంగా 13.3 సెం.మీ, యలమంచిలి మండలంలో అత్యల్పంగా 5 సెం.మీ వర్షం కురిసింది. శుక్రవారం వేకువజాము నుంచి మధ్యాహ్నం వరకు కుండపోతగా వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి కొంత తెరిపిచ్చినా రాత్రి వరకు జల్లులు పడుతూనే ఉన్నాయి.

- కుండపోతతో తణుకు మండలం దువ్వ రెగ్యులేటర్ వద్ద గల కొత్తపేట కాలనీ ముంపునకు గురైంది. వరదనీరు పూరిళ్లను చుట్టిముట్టింది. ముంపు ప్రాంతాలను కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎమ్మెల్యే ఆరుమిల్లి రాధాకృష్ణ పరిశీలించారు. ముంపు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.
- తాడేపల్లిగూడెం మండలంలోని బంగారుగూడెం నుంచి నందమూరు వరకు ఉన్న గ్రామాలను ఎరక్రాలువ ముంపు వెంటాడుతోంది. ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో ఈ ప్రాంతంలోని వేల ఎకరాలు ముంపులో తేలుతున్నాయి. నందమూరు, మాధవరం గ్రామాల్లో ముంపు ప్రాంతాలను అప్పడా మాజీ వైస్ చైర్మన్ వడ్డి రఘురాం, జెడ్పీటీసీ సభ్యుడు ముత్యాల అంజనేయులు, ఎంపీపీ పి.శేషులత పరిశీలించారు.
- భీమవరంలో యనమదుర్రు డ్రెయిన్ పొంగి ప్రవహిస్తుండటంతో పట్టణంలోని మెంటేవారితోట, పెదపేట ప్రాంతాలకు ముంపు ప్రమాదం పొంచి ఉంది.
- నరసాపురం పట్టణంలోని పొన్నపల్లి, మాధవాయిపాలెం, ఎన్టీఆర్ నగర్, గ్రేస్‌నగర్, నందమూరు కాలనీ ప్రాంతాలు నీట మునిగాయి.
- పాలకొల్లులోని శివారు ప్రాంతాల్లో రోడ్లు నీట మునిగి రాకపోకలకు సమస్యగా మారింది. బ్రాడీపేట, ఓల్డ్ బ్యాంక్ కాలనీ, లజపతిరాయ్‌పేట ప్రాంతాల్లో డ్రెయినేజీ నీరు రోడ్లపైకి చేరి పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయి.
- తణుకులోని ఇరగవరం కాలనీ, ఎన్‌జీఓ కాలనీ, బ్యాంక్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీల్లో డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి.

గూడెంలో అత్యధిక వర్షపాతం

భీమవరం: జిల్లావ్యాప్తంగా కురుస్తున్న భారీవర్షాలు జనజీవనాన్ని స్తంభింపజేస్తున్నాయి. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం 8.30 గంటల వరకు సగటున 87.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా తాడేపల్లిగూడెంలో అత్యధికంగా 133 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మండలాల వారీగా పాలకొల్లులో 123.6 మి.మీ, పెంటపాడులో 113, తణుకులో 112.8, గణపవరంలో 106.4, పెనుమంట్రలో 100.6, పోడూరులో 94.4, ఇరగవరంలో 94, భీమవరంలో 88.6 వర్షపాతం నమోదైంది. నరసాపురంలో 84.6, ఉండిలో 82.6, ఆచంటలో 82.4, పాలకోడేరులో 79.4, అత్తిలిలో 78.6, పెనుగొండలో 72.4, మొగల్తూరులో 71.4, వీరవాసరంలో 65.6, ఆకివీడులో 58.2, కాళ్లలో 51.6 యలమంచిలిలో 50.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.


తణుకు మండలం దువ్వలోని కొత్తపేట కాలనీలో నీట మునిగిన పూరిళ్లు


తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నేలకూలిన భారీ వృక్షం


పెనుగొండ మండలం దొంగరావిపాలెంలో జాతీయ రహదారిపై కూలిన వృక్షాన్ని తొలగిస్తున్న పోలీసులు


తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురంలో ఇళ్లను తాకుతూ వరద నీరు


నరసాపురం గడ్డి బజార్ ప్రాంతంలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి


మాట్లాడుతున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో పరిశ్రమల స్థాపన కోసం ఔత్సాహికులకు మరింత ప్రోత్సాహాన్ని అందించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి మరింత విస్తృత పరచాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి, ఔత్సహిక పారిశ్రామికవేత్తలకు బ్యాంకర్లు సహకరించాలన్నారు. పరిశ్రమల ప్రమోషన్‌కు సంబంధించి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లాలో గుర్తించిన 45 ప్రమాదకర పరిశ్రమలను క్షుణ్ణంగా తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలన్నారు. సింగిల్ డెస్క్ పాలసీ కింద గత నవంబర్ 24 నుంచి ఇప్పటి వరకు 171 దరఖాస్తులు రాగా 164 దరఖాస్తులను తిరస్కరించామన్నారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ కింద సబ్సిడీ రుణాలకు ప్రోత్సహించాలన్నారు. ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) ద్వారా మార్కెటింగ్ నిర్వహించుకునే అవకాశాలపై అవగాహన కల్పించాలన్నారు. పారిశ్రామిక అభివృద్ధి పాలసీ కింద 66 యూనిట్లకు గాను రూ.2.21 కోట్ల రాయితీకి ఆమోదం తెలిపారు. పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మంగపతిరావు సంబంధిత వివరాలను సమావేశంలో కలెక్టర్‌కు వివరించగా ఆయా అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక పవరుపేటోలని అన్నేభవన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కృష్ణా, గోదావరి డెల్టా పరిధిలో కాలువలు ఆధునీకరణ జరగకపోవడం, కాలువల్లో గుర్రపుడెక్క, తూడు, కర్రనాచు, కిక్కిస పేరుకుపోవడం ముంపునకు కారణమన్నారు.

న్యూస్‌రీల్

సిద్ధాంతంలో ప్రమాద హెచ్చరిక


కేదారీఘాట్ వద్ద ప్రమాద హెచ్చరిక ఫ్లెక్సీ

పెనుగొండ: సిద్ధాంతంలో వశిష్ఠ గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎనిమిది అడుగుల మేర నీటిమట్టం పెరిగి మధ్యస్థ లంకను తాకింది. వరద మరింత పెరిగే అవకాశం ఉండటంతో సిద్ధాంతంలోని కేదారీఘాట్‌లో అధికారులు ప్రమాద హెచ్చరిక ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. పడవల రాకపోకలపై నియంత్రించారు. మధ్యస్థ లంకలో వాణిజ్య పంటలతో పాటు పశువులు ఉండటంతో సిద్ధాంతం, దొంగరావిపాలెం, నడిపూడి, నక్కావారిపాలెం రైతులు ఆందోళన చెందుతున్నారు. పశుగ్రాస కొరత ఏర్పడుతుందని ఆవేదన చెందుతున్నారు. అలాగే పశువులను లంకల నుంచి ఏటిగట్టుకు చేర్చాల్సి వస్తుందని అంటున్నారు.

కూటమిది దుర్మార్గపు పాలన


మేకా శేషుబాబు, మాజీ ఎమ్మెల్సీ

పాలకొల్లు అర్బన్: నెల రోజుల కూటమి ప్రభుత్వ పాలనలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడం, హత్యలు చేయడం పరాకాష్టకు చేరాయని మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు ధ్వజమెత్తారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుల ఇళ్లపై దాడులు చేసి ఆస్తులు ధ్వంసం చేయడం విచారకరమన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లోపించాయన్నారు. పల్నాడు జిల్లా వినుకొండలో వైఎస్సార్ సీపీ కార్యకర్త రషీద్‌ను టీడీపీ నాయకుడు మహ్మద్ జిలానీ నడిరోడ్డుపై అందరూ చూస్తుండగా కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి నరికి చంపడం రాష్ట్రంలో అరాచక పాలనకు నిదర్శమన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులను తక్షణం ఆపాలన్నారు. రాష్ట్రపతి జోక్యం చేసుకుని ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేసి రాష్ట్రపతి పాలన విధించాలని శేషుబాబు డిమాండ్ చేశారు.

నేడు పాఠశాలలకు సెలవు

భీమవరం: భారీ వర్షాల కారణంగా శనివారం జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు సెలవు ప్రకటించినట్టు డీఈఓ జి.నాగరాణి ప్రకటనలో తెలిపారు. పాఠశాలల పరిసరాలను శుభ్రం చేయాలని, భవనాలు శిథిలావస్థలో ఉంటే వెంటనే విద్యాశాఖ దృష్టికి తీసుకురావాలని ఆమె ఆదేశించారు.

కళాశాలలకూ..

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): భారీ వర్షాల నేపథ్యంలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో జూనియర్ కళాశాలలకు శనివారం సెలవు ప్రకటించినట్టు ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర్‌బాబు ప్రకటనలో తెలిపారు. అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలలు ఈ ఆదేశాలు పాటించాలన్నారు.

జెడ్పీ పనులపై ప్రత్యేక దృష్టి


సమీక్షిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లా విద్యాశాఖ అధికారులు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ శుక్రవారం సమీక్షించారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, స్కూల్ కిట్ల పంపిణీ, డ్రాప్‌అవుట్లు, పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లా పరిషత్ పనులను వెంటనే పూర్తిచేసి బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా చూడాలన్నారు. జెడ్పీ ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎస్.నిర్మల జ్యోతి, అధికారులు పాల్గొన్నారు.

ఎర్రకాలువ ఉగ్రరూపం

జంగారెడ్డిగూడెం రూరల్: భారీ వర్షాలకు జంగారెడ్డిగూడెం మండలంలోని కొంగువారిగూడెం శ్రీకరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయం ఉగ్రరూపం దాల్చింది. జలాశయంలోకి ఉదయం 6 గంటల సమయంలో 30,153 క్యూసెక్కుల వరద నీరు రాగా డ్యాం గేట్లను ఎత్తి గంటకు 17,306 క్యూసెక్కులు, మధ్యాహ్నం 17,250 క్యూసెక్కుల నీరు రాగా 17,250 క్యూసెక్కులు, సాయంత్రం 12,500 క్యూసెక్కుల నీరు రాగా 12,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచినట్టు ఇరిగేషన్ శాఖ డీఈ రాంబాబు తెలిపారు. జలాశయం నీటిమట్టం 83.50 మీటర్లు కాగా ప్రస్తుతం 83 మీటర్లకు చేరింది. ఎర్రకాలువ జలాశయం ప్రాంతాన్ని ఇరిగేషన్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ దేవప్రకాష్, లక్కవరం ఎస్సై సుధీర్ పరిశీలించారు. వరద ముంపుతో పొలాలకు తీవ్రం నష్టం వాటిల్లుతుందని రైతులు అంటున్నారు.

క్లుప్తంగా

శిలాఫలకంపై పెయింట్



మార్కెట్ కమిటీ ఆవరణ గోడకు ఏర్పాటు చేసిన శిలా ఫలకంపై ఉన్న ఫొటోలపై పెయింట్ వేసిన దృశ్యం

చింతలపూడి : చింతలపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణ గోడకు ఏర్పాటు చేసిన శిలా ఫలకంపై ఉన్న ఫొటోలను గుర్తు తెలియని వ్యక్తులు పెయింట్ వేసి చెరిపి వేశారు. ఈ సంఘటన జరిగి కొద్ది రోజులు కావస్తున్నా ఇంత వరకు ఎవరు పట్టించుకో లేదు. మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం సందర్భంగా 2022లో పాలక వర్గం జాబితా పేర్లతో ఉన్న శిలాఫలకాన్ని ఆవరణ గోడకు ఏర్పాటు చేశారు. శిలా ఫలకంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ఏలూరు మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు, మాజీ శాసన సభ్యులు ఉన్నమట్ల ఎలీజా, మాజీ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డిల ఫొటోలను ముద్రించారు. ఈ సంఘటనలపై అధికారులకు ఫిర్యాదు చేస్తామని వైసీపీ నాయకులు తెలిపారు.

వెంకటనారాయణ మృతదేహం లభ్యం

భీమవరం : భీమవరం పట్టణం గులాబీ సెంటర్‌కు చెందిన గొంట్ల వెంకటనారాయణ ఈనెల 18వ తేదిన అదృశ్యమైనట్లు కేసు నమోదు కాగా అతని మృతదేహం శుక్రవారం నాగిడిపాలెం కాలువలో లభించినట్లు టుటౌన్ ఏఎస్‌ఐ దేవరాజ్ చెప్పారు. వెంకటనారాయణ అదృశ్యమైనట్లు అతని భార్య ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వెంకటనారాయణ మోటారు సైకిల్ సెల్‌ఫోన్ నాగిడిపాలెం బ్రిడ్జి వద్ద లభించడంతో కాలువలో గాలించగా మృతదేహం లభించిందన్నారు. మిస్సింగ్ కేసును అనుమానదస్పద మృతిగా మార్చి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు దేవరాజ్ చెప్పారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఉండి : ఉండి మండలం అర్తమూరు శివారు కవిటంపాకలలోని తెల్లికోడు మురుగుకాలువలో శుక్రవారం గుర్తు తెలియని పురుషుడి మృతదేహం లభ్యమైంది. శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో స్థానిక ఆక్వారైతులు తెల్లికోడులో గుర్తు తెలియని మృతదేహం ఉందంటూ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ఎం లక్ష్మణ తన సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని పైకి తీయించారు. మృతుడు వయసు సుమారు 25 నుండి 30 ఏళ్ల మధ్య ఉంటుందని, ఒంటిపై ముదురు నీలం రంగు టీషర్టుపై నల్లగీతలు ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. రెవెన్యూ అధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపారు.

ట్రిపుల్ ఐటీ.. బోధనలో మేటి

22, 23 తేదీల్లో నూజివీడు ట్రిపుల్‌ఐటీలో కౌన్సెలింగ్



నూజివీడు ట్రిపుల్ ఐటీ

నూజివీడు : రాష్ట్రంలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఈ విద్యా సంవత్సరంలో ఈ నెల 22 నుంచి 27 వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఈ నెల 22, 23 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహణకు ట్రిపుల్‌ఐటీ అధికారులు సిద్ధమవుతున్నారు. ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ విద్యాబోధనలో భాగంగా ఆహ్లాదకరమైన వాతావరణం, క్రమశిక్షణ, ఉత్తమ విద్యాబోధన, ఉన్నత సామాజిక స్పృహ నూజివీడు ట్రిపుల్ ఐటీ సొంతం. విద్యతో పాటు విద్యార్థుల మానసిక, శారీరక వికాసానికి ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, క్రీడలు, శాస్త్రీయ సంగీతం, నాట్యం, యోగా వంటి మైనర్ కోర్సులు ఇక్కడ ప్రత్యేకం. వీటిల్లో నిత్యం ఇక్కడ శిక్షణనిస్తారు.

రెండ్రోజుల్లో 1,100 మందికి కౌన్సెలింగ్

నూజివీడు ట్రిపుల్ ఐటీలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం నిర్వహిస్తున్న కౌన్సెలింగ్‌లో భాగంగా రెండు రోజుల్లో 1100 మందికి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. అభ్యర్థులందరికీ ఇప్పటికే ట్రిపుల్ ఐటీ అధికారులు కాల్‌లెటర్లు పంపడంతో పాటు వారి సెల్‌ఫోన్‌లకు మెసేజ్‌లు పంపారు. ఉదయం అల్పాహారం అనంతరం అసెంబ్లీ, 8 గంటల నుంచి 12 గంటల వరకు తరగతులు, 12 నుంచి ఒంటి గంట వరకు భోజన విరామం, మళ్లీ ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు, అనంతరం టీ, స్నాక్స్, 6 గంటల వరకు ఆటలు, రాత్రి 7 గంటలకు భోజనం, రాత్రి 10 గంటల వరకు స్టడీ అవర్స్ ఉంటాయి.

ట్రిపుల్‌ఐటీ ప్రత్యేకతలు

- ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ విద్యలో మొదటి రెండు సంవత్సరాలు ఇంటర్‌కు సమానమైన పీయూసీ కోర్సును, తరువాత నాలుగేళ్లు ఇంజినీరింగ్ విద్యను బోధిస్తారు.
- ట్రిపుల్‌ఐటీలో చేరిన తరువాత విద్యార్థులు మొదటి రెండు సంవత్సరాలు(పీయూసీ) ఏడాదికి రూ.45 వేలు, తరువాత నాలుగు సంవత్సరాలు(ఇంజినీరింగ్) ఏడాదికి రూ.50 వేలు చొప్పున చెల్లించాలి. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హత కలిగిన విద్యార్థులకు ప్రభుత్వమే చెల్లిస్తుంది. ప్రభుత్వం చెల్లించిన నగదుపోను మిగిలిన సొమ్మును విద్యార్థులే చెల్లించాల్సి ఉంటుంది.
- అన్ని సబ్జెక్టులకు ప్రతినెలా పరీక్షలు ఉంటాయి. నాలుగు నెలల తరువాత సెమిస్టర్ పరీక్షలు ఉంటాయి. ప్రతి సెమిస్టర్ 24 వారాలు ఉంటుంది. వేసవి సెలవులు కేవలం 3 వారాలు మాత్రమే ఉంటాయి. ఆగస్టు మొదటి వారంలో తరగతులు ప్రారంభమై నవంబరు 30 వరకు జరుగుతాయి. అనంతరం సెమిస్టర్ పరీక్షలు ఉంటాయి. పీయూసీలో ఆరు సబ్జెక్టులుంటాయి. ఆంగ్లం(రెండు పేపర్లు), గణితం(రెండు పేపర్లు), భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, తెలుగు, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ సబ్జెక్టులుంటాయి.
- సెలవు రోజులలో తల్లిదండ్రులు వచ్చి తమ పిల్లలతో గడపడానికి అవకాశం ఉంటుంది. అత్యవసర పరిస్థితులలో పిల్లలను అవసరమైతే ఇళ్లకు పంపుతారు. ఇచ్చిన గడువులోగా రాకపోతే ఫైన్ విధిస్తారు.
- విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. దీనికి ట్రిపుల్‌ఐటీ ఆవరణలోనే 30 పడకల ఆసుపత్రి ఉంది. 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉంటారు.
- రిజిస్ట్రేషన్ ఫీజు కింద రూ.వెయ్యి. ఎస్సీ ఎస్టీలు అయితే రూ.500 చెల్లించాలి. రిఫండబుల్ కాషన్ డిపాజిట్ కింద ప్రతి అభ్యర్థి రూ.2 వేలు అడ్మిషన్ సమయంలో చెల్లించాలి.

కౌన్సెలింగ్‌కు అవసరమైనవి

పదోతరగతి హాల్‌టికెట్, పదో తరగతి గ్రేడ్ షీట్, పదో తరగతి టీసీ, కాండక్ట్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్(4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు), మీసేవా కేంద్రం నుంచి తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రం, ఈ ఏడాది ఏప్రిల్ తరువాత మీసేవా కేంద్రం ద్వారా తీసుకున్న ఆదాయ ధృవపత్రం, అభ్యర్థి, అతని తండ్రి, తల్లిది రెండు పాసు పోర్టు ఫొటోలు, రేషన్‌కార్డు, అభ్యర్థి ఆధార్‌కార్డు, విద్యార్థులకు ఎవరికైనా బ్యాంకు లోన్ అవసరమైతే పైన పేర్కొన్న సర్టిఫికెట్లన్నీ నాలుగు సెట్లు, అభ్యర్థి తండ్రి ఉద్యోగి అయితే ఎంప్లాయి ఐడెంటీ కార్డు, శాలరీ సర్టిఫికెట్, అభ్యర్థి తండ్రి పాన్‌కార్డు, ఆధార్ కార్డు, వోటర్ ఐడీ కార్డు తెచ్చుకోవాలి.

నర్సాపురం ఎంపీడీఓ కోసం గాలింపు



తోటగూడెం కాల్వలో వెదుకుతున్న హనుమాన్ జంక్షన్ పోలీసులు

దెందులూరు: అదృశ్యమైన నర్సాపురం ఎంపీడీఓ కోసం గాలిస్తున్న విషయం విధితమే. ఈ నేపథ్యంలో శుక్రవారం దెందులూరు నియోజకవర్గంలో కృష్ణా కాల్వ తోటగూడెంలో హనుమాన్ జంక్షన్ పోలీసులు గాలింపు చేపట్టారు. అసిస్టెంట్ ఇంజనీర్లు లస్కర్లను అప్రమత్తం చేశారు. ఎలాంటి సమాచారం తెలిసినా హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్‌కు తెలియచేయాలని సూచించారు.

చోరీ కేసులో 6 నెలల జైలు

నరసాపురం: దొంగతనం కేసులో నేరం రుజువు కావడంతో వీరవాసరం మండలం బొబ్బనపల్లికి చెందిన కట్టా సుబ్బారావుకు శుక్రవారం నరసాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి 6 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పినట్టు కోర్టు లైజన్ అధికారి, ఏఎస్సై ఉదయభాస్కరరావు చెప్పారు. గత ఏడాది డిసెంబర్ 10న యలమంచిలి మండలం గుంపర్రు గ్రామానికి చెందిన జడ్డు శ్రీనివాస్ తల్లికి ఆరోగ్యం బాగోకపోవడంతో ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లాడు. 15వ తేదీ ఇంటికి రాగా తలుపులు తీసి ఉండటంతో గమనించి ఇంట్లో సుమారు 5 కాసుల బంగారు వస్తువులు చోరీకి గురయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. యలమంచిలి ఎస్సై శివన్నారాణ క్లూస్‌టీమ్ రప్పించి దర్యాప్తుచేసి సుబ్బారావు దొంగతనం చేసినట్టుగా గుర్తించి అరెస్ట్ చేశారు.

నీటమునిగిన నారుమళ్ల సస్యరక్షణ ఇలా



పెనుమంత్ర మండలం పాలమూరులో నీట మునిగిన వరినాట్లు

భీమవరం: జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న అధిక వర్షాల కారణంగా ప్రస్తుత సార్వా వరినాట్లు, నారుమళ్లు అనేకచోట్ల నీట మునుతున్నాయి. జిల్లాలో 10,880 ఎకరాల్లో నారుమడి వేయగా దీనిలో 1,240 ఎకరాల్లో నారుమళ్లు నీట మునిగాయి. 36,299 ఎకరాల్లో నాట్లు వేయగా 6,194 ఎకరాల్లో నాట్లు ముంపునకు గురయ్యాయి. ముంపునకు గురైన వరినాట్లు, నారుమళ్లకు సరియైన యాజమాన్య పద్ధతులను పాటించాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు చెప్పారు.

విత్తనం చల్లిన రెండు, మూడు రోజుల్లో ముంపునకు గురైతే మొలక శాతం గణనీయంగా తగ్గుతుంది. అందువల్ల రైతులు నారుమడిలో వీలైనంత త్వరగా నీళ్ళు పూర్తిగా బయట తీసివేయాలి. దీనివల్ల విత్తనం గాలి పోసుకొని మొలక త్వరగా వస్తుంది. నీరు తీయడానికి వీలు లేక మొలక దెబ్బ తింటే తిరిగి విత్తనం చల్లుకోవాలి. విత్తనం 7–30 రోజుల మధ్యలో నారుమడి 5 రోజుల కన్నా ఎక్కువగా నీట మునిగితే నారు దెబ్బ తినే అవకాశం ఉంది. నీట మునిగిన 5 రోజుల లోపు నీటిని పూర్తిగా బయటకు తీసి నారుమడికి గాలి తగిలేలా చేయాలి. తర్వాత 5 సెంట్ల నారుమడికి కిలో యూరియా, కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవడం వల్ల కొత్త ఆకు వచ్చి నాట్లు వేయడానికి వీలుగా ఉంటుంది. వర్షాల కారణంగా నారుమడిలో తెగుళ్ల ఎక్కువగా ఆశించే అవకాశం ఉన్నందున నీటిని పూర్తిగా బయటకు తీసివేసి మొక్క నిలదొక్కుకున్న తర్వాత తెగుళ్ళ నివారణకు గ్రాము కార్బన్‌డిజం లేదా కార్బన్‌డజిం, మాంకోజెబ్ మిశ్రమం రెండు గ్రాములు లీటరు నీటిలో కలిపి పైపాటుగా పిచికారి చేసుకోవాలి.

నాట్లు వేసిన చేలలో

వరినాట్లు ముంపునకు గురైతే నీటిని పూర్తిగా బయటకు తీసివేసి పైపాటుగా ఎకరానికి 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువులను బూస్టర్ డోస్‌గా వేసుకోవాలి. నీరు పూర్తిగా తీయకుంటే ఆకుపై రెండు శాతం యూరియా లేదా పొటాషియం నైట్రేట్ పిచికారి చేయడం ప్రయోజనకరం. వరినాట్లు పూర్తిగా కోలుకున్న తర్వాత మాగుడు తెగులు, ఇతర కుళ్ళు తెగులు సోకకుండా కార్బన్‌డిజం గ్రాము లేదా కార్బన్‌డిజం, మాంకొటేట్ మిశ్రమం మందు రెండు గ్రాములు చొప్పున లీటరు నీటికి కలిపి పైపాటుగా పిచికారి చేయాలి.

విత్తనం వెదజల్లిన చేలలో

వరి విత్తనం వెదచల్లిన వెంటనే అధిక వర్షాలు వలన మొలక శాతం దెబ్బ తింటుంది. రైతులు వర్షాలు తగ్గిన వెంటనే నీరు బయటకు పోవడానికి కాల్వలు ఏర్పాటు చేసుకొని వీలైనంత త్వరగా నీటిని పూర్తిగా బయటకు తీసి గాలి సోకే విధంగా చేయాలి. దీనివల్ల మొలక త్వరగా వస్తుంది. విత్తనం 10–30 రోజుల లోపు 5 రోజుల కన్నా ఎక్కువగా నీట మునిగితే వరి దెబ్బతినే అవకాశం ఉంది. నీట మునిగిన 5 రోజుల లోపు నీటిని పూర్తిగా బయటకు తీసివేసి పంటకు గాలి తగిలేలా చేయాలి. పై పాటుగా ఎకరానికి 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువులు బూస్టర్ డోస్‌గా వేసుకోవాలి. నీరు పూర్తిగా తీయకుంటే ఆకుపై రెండు శాతం యూరియా లేదా పొటాషియం నైట్రేట్‌ను పిచికారి చేయడం వల్ల పైరు త్వరగా కోలుకుంటుంది. వరిపైరు కోలుకున్న తర్వాత తెగుళ్ళ వ్యాప్తి నివారణకు గ్రాము కార్బన్‌డిజం లేదా కార్బన్‌డిజం, మాంకోజెట్ మిశ్రమ మందు రెండు గ్రాములు చొప్పున లీటరు నీటిల్లో కలిపి పైపాటుగా పిచికారి చేసుకోవాలని వెంకటేశ్వరరావు చెప్పారు.

కుష్టు నివారణకు సమగ్ర సర్వే

- నరసాపురం, పాలకొల్లు నియోజకవర్గాల్లో 60 కేసుల గుర్తింపు
- 21 కేసుల్లో ప్రత్యేక చికిత్స
- ఆగస్టు 2 వరకు సర్వే



పాలకొల్లు మండలం దగ్గులూరులో బాలుడి శరీరంపై ఉన్న మచ్చలను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు

పాలకొల్లు అర్బన్: కుష్టు రహిత సమాజం కోసం చేస్తున్న కృషిలో భాగంగా అధికారులు జిల్లాలో చేపట్టిన సర్వే కొనసాగుతోంది. పాలకొల్లు, నరసాపురం, పోడూరు, ఆచంట, యలమంచిలి మండలాల్లో 60 కేసులు గుర్తించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం 21 కేసులకు ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. ప్రభుత్వాసుపత్రి మెడికల్ ఆఫీసర్ డా. గంగాభవాని, చర్మవ్యాధుల నిపుణులు డా.కె శ్రీనుబాబు, డా.జక్కంపూడి సుభాషిణి లెప్రసీ కేసులను గుర్తించి ఎండీటీ మందుల కోసం సిఫార్సు చేస్తున్నారు. సాధారణంగా ఏడాదికి రెండుసార్లు ప్రత్యేక సర్వే నిర్వహిస్తుంటారు. జూలై, డిసెంబర్ నెలల్లో వీటిని చేపడుతుంటారు. ఇందులో భాగంగా ఈ ఏడాది జిల్లాలో చేపట్టిన ఇంటింటి సర్వే ఆగస్టు రెండో తేదీ వరకు కొనసాగుతుందని అధికారులు తెలిపారు. డిస్ట్రిక్ట్ లెప్రసి, ఎయిడ్స్ అండ్ టీబీ ఆఫీసర్ పర్యవేక్షణలో మెడికల్ ఆఫీసర్ల సమక్షంలో కేసులను గుర్తిస్తారని చెప్పారు. అంగవైకల్యం వచ్చిన వారికి ప్రభుత్వం ఉచితంగా ఆపరేషన్ చేయించి రూ.8000 నగదు కూడా అందించనున్నట్టు తెలిపారు. 2027 నాటికి భారతదేశాన్ని కుష్టురహిత దేశంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందని వివరించారు.

వ్యాధి వ్యాప్తి ఇలా..

మైక్రో బాక్టీరియా లెప్రి అనే సూక్ష్మ క్రిమి ద్వారా లెప్రసి వ్యాధి వ్యాపించి 2 నుంచి 10 సంవత్సరాలల్లో నూటికి 99 కేసులు మచ్చల రూపంలో బయటపడ్డాయి రోగ తీవ్రతను బట్టి అంగవైకల్యం ఏర్పడుతుంది. ఈ మచ్చలు రాగి, గోధుమ రంగులో ఉండి తిమ్మిరి లేదా స్పర్శ కోల్పోవటం, మచ్చలపై వెంట్రుకలు రాలిపోవడం, చెమట పట్టక పోవడం అతి తక్కువ కేసుల్లో బ్యాక్టీరియా నేరుగా నరాలపై దాడి చేసి అవయవాలు దెబ్బతినేలా చేస్తుందని. చేతి వేళ్లు పట్టు ఇవ్వకపోవడం, మణికట్టు సహకరించకపోవడం, పాదాలకు తిమ్మిర్లు వచ్చి కాలికి వేసుకున్న చెప్పులు జారిపోవడం చేతి వేళ్ల తిమ్మిర్లు, వంకర్లు పోవడం, చెవులు చుట్టూ బొడిపెలు ఏర్పడడం వంటి లక్షణాలు లెప్రసి సోకిన రోగికి కనిపిస్తాయి.

ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నాం...



కుష్టు వ్యాధి నిర్ధారణ కోసం ప్రత్యేక సర్వే చేస్తున్నాం. జిల్లాలోని ప్రతీ గ్రామంలోనూ ఆశ, ఏఎన్‌ఎం, హెల్త్ అసిస్టెంట్ ద్వారా ఇంటింట సర్వే చేస్తున్నాం. ఈ సర్వేలో అనుమానితులను గుర్తించి వారికి ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తాం, రోగ నిర్ధారణ అయితే ఎండీటీ మందులు అందిస్తాం. జిల్లాలో ప్రస్తుతం 60 కేసులు గుర్తించాం. వాటిలో 21 మందికి ప్రత్యేక చికత్స అందిస్తున్నాం.

– జక్కంపూడి రాంప్రసాద్, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్

ఆన్‌లైన్ యాప్‌తో మోసం

భీమవరం : ఆన్‌లైన్ యాప్‌లో పెట్టుబడి పెట్టి మోసపోయామంటూ భీమవరం వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన కొంత మంది శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. చైన్ లింక్ ద్వారా తక్కువ మొత్తంలో పెట్టుబడి పెడితే భారీగా ఆదాయం వస్తుందంటూ ఓ యాప్ ద్వారా ప్రచారం చేయడంతో అదనపు ఆదాయం సమకూరుతుందనే ఆలోచనతో పెట్టుబడి పెట్టామంటున్నారు. శాంసంగ్ బ్రాండ్ లోగో ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవడం ఎస్‌బీఐ గ్యారంటీ ఉందని చూపడంతో నమ్మి పెట్టుబడి పెట్టామని అయితే తమకు ఎటువంటి ఆదాయం రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. పోలీసుల వివరణ కోరగా ఎటువంటి కేసు నమోదు కాలేదని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

శాకంబరిగా అలంకరణలో మండపాక యల్లారమ్మ



ఎప్రత్యేక అలంకరణలో యల్లారమ్మ అమ్మవారు

తణుకు టౌన్: మండలం మండపాక గ్రామంలోని యల్లారమ్మ అమ్మవారిని ఆషాడ మాసం సందర్భంగా శాకంబరిగా యల్లారమ్మ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈవో పీ సూర్యనారాయణ, నాయకులు ఆత్మకూరి రామకృష్ణ, పీ భాస్కరరావు, మల్లపరాజు, ఫణి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో తగిన జాగ్రత్తలు పాటించాలి

అత్తిలి: కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అత్తిలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె నాగరాజు అన్నారు. శుక్రవారం అత్తిలి మండలం కె సముద్రపుగట్టు గ్రామంలో ఆరోగ్య సర్వే జరిపారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించిన సూచనలు చేశారు. వర్షాకాలంలో సంబంవించే వ్యాధులు, నివారణా చర్యలను ఆయన ప్రజలకు వివరించారు. ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే ఆస్పత్రికి వచ్చి పరీక్షలు జరిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మెంతు రాజ్‌కుమార్, గుడాల కాంతారావు, బందెల సామ్యూల్‌రాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు దీపికారాణి తదితరులు పాల్గొన్నారు.

వచ్చే సీజన్‌కు గండ్లు పూడ్చిస్తాం



వీరంపాలెం వద్ద ఎర్ర కాలువ వరద పరిస్థితిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం రూరల్: వచ్చే సీజన్ నాటికి ఎర్ర కాలువ గండ్లు పూడ్చిస్తామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ రైతాంగానికి భరోసానిచ్చారు. శుక్రవారం మండలంలోని ఎర్ర కాలువ ముంపు గ్రామాలైన వీరంపాలెం, పట్టింపాలెం, అప్పారావుపేట, మాధవరం, జగన్నాథపురం, నవాబుపాలెం, మారంపల్లి, నందమూరు గ్రామాల్లో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా మాధవరం వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎర్ర కాలువ మరింత ఉధృతంగా మారే అవకాశం ఉందని, రైతులెవ్వరూ పంట పొలాల వద్దకు వెళ్లవద్దని హితవు పలికారు. ఇప్పటి వరకు జరిగిన నష్టానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఆయన వెంట తహసీల్దార్ మురళీకృష్ణ, ఏడీఏ పి.మురళీకృష్ణ, మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్, కూటమి నాయకులు వలవల బాబ్జీ, ఈతకోట తాతాజీ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

తణుకు టౌన్: రాజమండ్రి ఆస్పత్రిలోని ఐతయూలో చికిత్స పొందుతున్న వ్యక్తికి తణుకు మానవత సంస్థ రూ. 15 వేల ఆర్థిక సహాయం అందజేసినట్లు మానవత అధ్యక్షురాలు కఠారి శారదాదేవి తెలిపారు. శుక్రవారం తణుకు రోటరీ క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాదాసు తులసీ దుర్గా సాయి వైద్య ఖర్చుల నిమిత్తం ఈ మొత్తాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ జిల్లా శాంతిర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, తణుకు శాఖ చైర్మన్ బోయపాటి రామలక్ష్మీ, కన్వీనర్ ఆనందం మస్తాన్‌రావు, కార్యదర్శి బీ రామ కాశీ, కోశాధికారి కాశీ, పూర్వ అధ్యక్షుడు డాక్టర్ ఏ బాలాజీ, ఎస్‌వీ సతీష్ బాబు, కఠారి కాశీ విశ్వనాథరాజు, పీ శివన్నారాయణ, ఎంఆర్ కోటేశ్వరరావు, రాజరాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలం యాత్రకు తణుకు ఆర్టీసీ బస్సు

తణుకు అర్బన్: తణుకు నుంచి అరుణాచలం, కంచి యాత్రకు ఆర్టీసీ స్పెషల్ బస్సు పంపుతున్నట్లు తణుకు డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ తెలిపారు. శుక్రవారం తణుకు డిపో నుంచి బయలుదేరిన ప్రత్యేక బస్సు శనివారం శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం పుణ్యక్షేత్రాలను చేరుకుంటుందని భక్తులు దర్శనాంతరం 21న పౌర్ణమి రోజున అరుణాచలం గిరిప్రదక్షిణ చేసుకుని రాత్రికి కంచి చేరుకుంటారని, 22న కంచిలోని ఆలయాల సందర్శనం అనంతరం బయలుదేరి 23న తణుకు చేరుకుంటుందని వివరించారు. వచ్చే నెల 17న బయలుదేరే ఆర్టీసీ బస్సులకు శనివారం నుంచి రిజర్వేషన్ చేసుకోవచ్చని చెప్పారు. వివరాలకు 98482 84384 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

జల దిగ్బంధం

- ముంపులో చిక్కుకున్న గ్రామాలు
- నీటి మునిగిన పొలాలు
- పరిస్థితిని పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే

అత్తిలి: ఎగతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో పంట చేలు ముంపుబారిన పడ్డాయి. అత్తిలి మండలంలో రాచకోడు, ఈర్లకోడు, మంచిలి, ఆరుదలకోడు మేజర్ డ్రెయిన్లు పొంగి ప్రవహించడంతో వరినాట్లు నీట మునిగాయి. శుక్రవారం నాటికి మండలంలో 15వేల ఎకరాలకు గాను ఇప్పటి వరకు 3 వేల ఎకరాల్లో వరినాట్లు పూర్తయ్యాయి. వర్షాల కారణంగా 2వేల ఎకరాలలో వరినాట్లు, 300 ఎకరాలలో నారుమళ్లు ముంపులో ఉన్నాయి.

వర్షాలతో దువ్వ వయ్యేరుకు వరద

తణుకు టౌన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువ ప్రాంతాల్లోని వరద నీరు కారణంగా తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో వయ్యేరుకు వరద పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన నీటితో ఎర్ర కాలువకు వరద పెరగడంతో ఆ వరద నీరు దువ్వ వయ్యేరులో చేరడంతో తణుకు మండలంలోని కోనాల, ముద్దాపురం, దువ్వ గ్రామాల్లోతో పాటు అత్తిలి మండలంలోని తిరుపతిపురం, వరిగేడు, తదితర గ్రామాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. దువ్వ గ్రామంలోని వయ్యేరు అక్విడెక్ట్ వద్ద వరద పరిస్థితిని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, ఇతర అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వయ్యేరు గట్టున నివాసం ఉంటున్న కుటుంబాల కోసం పునరావాసం కేంద్రం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వరద కారణంగా ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు, ఈదురు గాలుల కారణంగా తణుకు పట్టణంలోని శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణ నీటితో నిండిపోయింది. శుక్రవారం వీచిన ఈదురు గాలులకు ఆవరణలోని భారీ వృక్షం కూలిపోయింది.

నారుమడులను పరిశీలించిన అధికారులు

పెంటపాడు: మండలంలో పలు గ్రామాల్లో వర్షం వల్ల దెబ్బతిన్న నారుమడులను సోమవారం వ్యవసాయాధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలో అధికంగా బి. కొండేపాడు, విప్పర్రు, కె.పెంటపాడు, మీనవిల్లూరు తదితర గ్రామాల్లో మడులు దెబ్బతిన్నాయన్నారు. ఈ సందర్భంగా ఏవో సారధిలు రైతులకు పలు సూచనలు చేశారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న ఎర్ర కాలువ

తాడేపల్లిగూడెం రూరల్: ఎర్ర కాలువ నీటి ప్రవాహం తాడేపల్లిగూడెం మండలం నందమూరు అక్విడెక్ట్ వద్ద ఉధృతంగా ఉంది. ఎగువన కొంగువారిగూడెం ప్రాజెక్టు నుంచి దాదాపు 17,306 క్యూసెక్కులు పైబడి నీటిని దిగువకు విడుదల చేయడంతో శుక్రవారం ఉదయానికి తాడేపల్లిగూడెం మండలంలోని బంగారుగూడెం, వీరంపాలెం, పట్టింపాలెం, అప్పారావుపేట, మాధవరం, జగన్నాథపురం, నవాబుపాలెం, దండగర్ర నందమూరు గ్రామాల మీదుగా ఎర్ర కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. వీరంపాలెం, మాధవరం, జగన్నాథపురం, అప్పారావుపేట, మారంపల్లి తదితర గ్రామాల్లోని వరి చేలను ఎర్ర కాలువ నీరు ముంచెత్తింది. అప్పారావుపేట – కోరుమామిడి, మాధవరం – కంసాలిపాలెం కాజ్‌వే వద్దకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇక్కడితో వర్షాలు తగ్గుముఖం పడితే రైతాంగం ఊపిరి పీల్చుకునే పరిస్థితి. లేకుంటే గ్రామాల్లోకి సైతం ఎర్ర కాలువ నీరు చేరుకునే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.



తణుకు టౌన్: దువ్వ వయ్యేరు వరద కారణంగా నీట మునిగిన గుడిసెలు



తాడేపల్లిగూడెం రూరల్: నందమూరు అక్విడెక్ట్ వద్ద ఎర్ర కాలువ వరద పరిస్థితి



అత్తిలి: ముంపులో వరినాట్లు

వదలని వాన

తాడేపల్లిగూడెం: అల్పపీడనంతో గురువారం ప్రారంభమైన వాన వదలడం లేదు. రాత్రి పగలు తేడా లేకుండా కురుస్తోంది. కొంతసేపు ఉపశమనం అన్నట్టుగా ఆగినట్టు ఆగి తిరిగి పెద్దపెద్దజల్లులతో కురుస్తోంది. వాన ప్రభావంతో రోడ్లు జలమయమయ్యాయి. డ్రెయిన్ల ప్రవాహానికి వ్యర్థాలు అడ్డం రావడంతో ముందుకు కదలడంలేదు. వానతో పాటు గాలి వీయడంతో చెట్లు విరిగిపడుతున్నాయి. కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో కరెంటు సరఫరాకు అంతరాయం కలుగుతోంది. పట్టణంలోని 35 వార్డులో నిండిన డ్రెయిన్లలో అడ్డుగా ఉన్న వ్యర్థాలను ప్రొక్లెయిన్లతో మునిసిపల్ అధికారులు తొలగిస్తున్నారు. పారిశుధ్య కార్మికులు నేరుగా డ్రెయిన్లలోకి దిగి ప్రవాహం సజావుగా సాగేలా ప్రయత్నం చేస్తున్నారు. వానల కారణంగా రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. వ్యాపారాలు లేక దుకాణాలు వెలవెలబోతున్నాయి.



మురుగునీటిలో దిగి డ్రెయిన్లను సరిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది



తణుకు టౌన్: దువ్వలో వరద పరిస్థితిని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే



పెంటపాడు: మీనవిల్లూరులో నీట మునిగిన వరి చేలు

తణుకు నియోజకవర్గంలో కుండపోత

- రెండు రోజులుగా కురుస్తున్న వాన
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- నీట మునిగిన పంటచేలు
- జనజీవనం అస్తవ్యస్తం

తణుకు: అల్పపీడనం ప్రబావంతో రెండ్రోజులుగా కుండపోత వర్షం కురుస్తోంది. గురువారం ఉదయం నుంచి ప్రారంభమైన వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. తణుకు నియోజకవర్గంలో కురుస్తున్న భారీ వర్షానికి జనజీవనం స్తంభించిపోయింది. పల్లపు ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పట్టణంలో ఫుట్‌పాత్, తోపుడు బండ్లు, చిరువ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. రోజువారి కూలీలు పనులకు వెళ్లలేకపోయారు. మరోవైపు విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర అవస్థలు పడ్డారు. తణుకు నియోజకవర్గంలోని తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లో సుమారు 20 వేల ఎకరాల్లో పంటచేలు నీటమునిగాయి. తణుకు పట్టణంలోని ప్రధాన రోడ్లు వెంబడి డ్రెయినేజీలు పొంగి ప్రవహించడంతో రోడ్లు చెరువులను తలపించాయి.



రోడ్లుపైకి వర్షపు నీరు చేరడంతో ఇబ్బందులు పడుతున్న చిరు వ్యాపారులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తణుకు అర్బన్: వర్షాలు విస్తారంగా కురుస్తున్న పరిస్థితుల్లో సీజనల్ వ్యాధులపట్ల ప్రజానీకం అప్రమత్తంగా ఉండాలని తణుకు సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని సంతమార్కెట్ ప్రాంతంలో శుక్రవారం నిర్వహించిన డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ముఖ్యంగా ఇంటి పరిసరాల్లోని నిరుపయోగంగా ఉన్న సామాగ్రితో పాటు మొక్కల కుండీల్లోని నీటిని కూడా తొలగింప చేసుకోవాలని సూచించారు. అవసరం లేని నీటి నిల్వల్లో దోమలు తమ సంతానాన్ని ఉత్పత్తి చేస్తాయని ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి నీటి నిల్వలను తొలగింప చేస్తే వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చని అన్నారు. చలి జ్వరం, ఒళ్లు నొప్పులు ఉంటే వెంటనే సమీపంలోని వైద్యులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రటరీలు కె.వెంకటలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్స్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్‌ను పరిశీలించిన కేంద్ర బృందం

తణుకు టౌన్: మండలం మండపాక గ్రామంలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను కేంద్ర నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్ (ఎన్‌క్యూఏఎస్) బృందం పరిశీలించింది. శుక్రవారం మండపాక గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లో రోగులకు అందుతున్న వైద్య సేవలు, పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది పనితీరు వంటి అంశాలను పరిశీలించారు. ఈ బృందం క్లినిక్ నిర్వహణ పట్ల సంతృప్తిని వ్యక్తం చేసినట్లు రేలంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కే బంగారు రవి తెలిపారు. విలేజ్ క్లినిక్‌లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రమాణాలు పాటించి గుర్తింపు పొందడం ద్వారా ఆయా క్లినిక్‌ల అభివృద్ధికి కేంద్రం ప్రత్యేకంగా నిధులను అందజేస్తుందని ఎన్‌క్యూఏఎస్ మేనేజర్ మేరీ సునీత తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయి గిరిరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ ప్రవీణ, ఏఎన్ఎం విక్టోరియా, వైటీ మూర్తి, జీకేఆర్‌సీవీ ప్రసాద్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కోర్టు ఫీజు స్టాంపుల కొరతపై న్యాయవాదుల ధర్నా

తణుకు అర్బన్: కోర్టు ఫీజు స్టాంపుల కొరతను నివారించి స్టాంపులను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూ ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఆధ్వర్యంలో శుక్రవారం తణుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద న్యాయవాదులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి మాట్లాడుతూ వివిధ కేసులకు సంబంధించి కోర్టు ఫీజు స్టాంపులు అందుబాటులో లేకపోవడంతో కక్షిదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తక్షణమే కోర్టు ఫీజు స్టాంపులను తణుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కె.వెంకటేశ్వర్లు, ఎం.మృత్యుంజయరావు, షేక్ బాజీ, పిల్లి రమేష్, రాపాక ప్రభాకరరావు, పొట్ల శ్రీనివాసు, ఎం. ప్రతాప్‌కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్: ఎర్ర కాలువ ముంపు బారిన పడిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఆక్వా డవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) మాజీ వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ నాయుడు కోరారు. శుక్రవారం మండలంలోని మాధవరం, జగన్నాథపురం, నవాబుపాలెం, ఆరుళ్ల, మారంపల్లి, అప్పారావు పేట, నందమూరు గ్రామాల్లోని ముంపు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా, విత్తనాలు సబ్సిడీపై అందజేయాలని కోరారు. అలాగే రైతాంగానికి 15 నుంచి 20 వేల రూపాయలు పరిహారం అందించాలని వైఎస్సార్ సీపీ తరఫున డిమాండ్ చేశారు. రైతాంగం పరిస్థితిని పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి పరిశ్రమను సైతం ఆదుకోవాలన్నారు. ముంపు కారణంగా పాడి పశువులకు మేత లభించే పరిస్థితి లేదని, పాడి రైతాంగానికి ఆదుకోవాలన్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పొనుకుమాటి శేషులత, సర్పంచ్ రాజమహేంద్రవరపు లక్ష్మణరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు, సేవాదళ్ మండల అధ్యక్షుడు కొండుబోయిన కృపావరం, మాజీ సర్పంచ్‌లు కోనేటి దానయ్య, మాకరాజు సతీష్, నాయకులు వీఎస్‌వీఎస్. నారాయణ, అడపా హరిబాబు, రైతులు ఉన్నారు.



మాధవరం వద్ద ఎర్ర కాలువ ముంపు చేలను పరిశీలిస్తున్న అప్సడా మాజీ వైస్‌చైర్మన్ రఘురామ్‌నాయుడు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

అత్తిలి: బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె కుమారి అన్నారు. 100 రోజుల మిషన్‌శక్తి కార్యక్రమంలో భాగంగా అత్తిలి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలలను పనిలో పెట్టుకోవడం, బాల్యవివాహాలను చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి

తాడేపల్లిగూడెం అర్బన్: బాల్య వివాహాలను నిర్మూలించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిని సరస్వతి తెలిపారు. పట్టణంలోని 24, 25 వార్డుల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోరబాలికలకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతి మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్ట రీత్యా నేరమన్నారు. బాలికలు ధైర్యంగా, ఆత్మస్థైర్యంతో ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమానికి సూపర్‌వైజర్ విశాలాక్షి, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రసన్న, సుజాత, సావిత్రి పాల్గొన్నారు.

చట్టాలను విద్యార్థులు అవగాహన చేసుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): నూతన చట్టాలను విద్యార్థులు తప్పక అవగాహన చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ టీఎల్ సరస్వతి పేర్కొన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 100 రోజుల మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 8వార్డు ఆడ పిల్లలకు శుక్రవారం నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.




అత్తిలిలో బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కీటక నియంత్రణ చర్యలతో వ్యాధుల నివారణ

తాడేపల్లిగూడెం రూరల్: కీటక నియంత్రణ చర్యలతో వ్యాధుల నివారించవచ్చునని మలేరియా తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం మండలంలోని పెద తాడేపల్లి గ్రామంలో ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ లార్వా బ్రీడింగ్ ప్రదేశాలను గుర్తించి వాటిని నాశనం చేయాలన్నారు. తద్వారా దోమల వృద్ధిని అరికట్టవచ్చన్నారు. దోమలను నియంత్రించడం ద్వారా వ్యాధులను అరికట్టవచ్చన్నారు. జ్వరపీడిత లక్షణాలున్న వారికి చికిత్స అందించి, ప్రాథమిక నిర్ధారణ పరీక్షలు అన్ని పట్టణ, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమష్ట కృషితోనే డెంగ్యూ వ్యాధిని అరికట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు నవ్య, ప్రవల్లిక, ఆరోగ్యక కార్యకర్తలు పద్మ, కుమారి, ఆరోగ్య సహాయకులు రమేష్, ఆశాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

అత్తిలి: భారీ వర్షాల కారణంగా ఎటువంటి అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సచివాలయ సిబ్బందికి తెలిపారు. భారీ వర్షాలు, వరదల కారణంగా అత్తిలి మండలంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ నాగరాణి శుక్రవారం సాయంత్రం అత్తిలి-1 సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో ఎంతమంది పనిచేస్తున్నారు. విధులలో ఎంతమంది ఉన్నారని పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరుపట్టికను పరిశీలించారు. విధి నిర్వహణలో ఎవరు అలసత్వం వహించినా సహించేది లేదని హెచ్చరించారు. ఇప్పటి వరకు సీసీ ఆర్ కార్డులు ఎంతమంది రైతులకు ఇచ్చారు. ఇంకా ఇవ్వాల్సిన కార్డులు ఎన్ని ఉన్నాయి అని ఆరా తీసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ భారీ వర్షాలు కారణంగా గ్రామాల్లో ఎటువంటి అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పారిశుధ్యంలో ఎటువంటి లోపం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి కె సుజాత, ఈవోఆర్డీ ఎం శ్రీనివాసరావు ఉన్నారు.



అత్తిలి గ్రామ సచివాలయంలో సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి